సాక్షి ఖమ్మం
శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



.. వసూళ్ల బాధ్యత ప్రైవేట్‌కు!?

కేఎంసీ పరిధిలో పన్నుల మదింపు, వసూళ్లలో లోపాలను సరిదిద్దే బాధ్యత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. 8లో



ఇస్రోలో ఉద్యోగాల పేరిట మోసం

ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షల్లో వసూలు చేసిన ముగ్గురిని ఏపీ పోలీసులు మధిరలో అరెస్ట్ చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు 'నిధి ఆప్ కే నికట్'

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయీస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిధి ఆప్ కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లు కె.సునీల్, రబీలాల్‌దాస్ తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యోగులు, పెన్షనర్లకు మధిర పంచాయతీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లా వాసులకు లక్ష్మీదేవిపల్లిలోని త్రివేణి హైస్కూల్ యమునా క్యాంపస్‌లో కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9–15నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

100 పడకల ఆస్పత్రికి గ్రీన్‌సిగ్నల్ !

- 5.10ఎకరాల భూమి కేటాయింపు

కూసుమంచి: కూసుమంచి మండలంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి తెలిపినట్లు సమాచారం. మండలంలోని గట్టుసింగారం – గంగబండ తండా మధ్య కేజీబీవీ సమీపాన అధికారులు ఇటీవల పరిశీలించి 5.10 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించడంతో ఆస్పత్రి ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. కాగా, స్థలం పత్రాలను శుక్రవారం సంబంధిత శాఖ అధికారులకు అప్పగిస్తామని తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. పాలేరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు 100పడకల ఆస్పత్రి మంజూరు చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు లకారంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ఖమ్మం రాపర్తినగర్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మంలోని లకారం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖఅధికారి బి.సుమన్‌చక్రవర్తి తెలిపారు. 'శాంతి' అంశంపై ఈ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. అలాగే, ఈనెల 28వ తేదీన పాఠశాల విద్యార్థినుల కోసం పులిగుండాల (కనకగిరి గుట్ట) టూర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రకాష్‌నగర్ వంతెనపై మరమ్మతులు ప్రారంభం

- రూ1.40కోట్ల అంచనా వ్యయంతో పనులు


వంతెన వద్ద జరుగుతున్న మరమ్మతు పనులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మున్నేటిపై ఉన్న ప్రకాష్‌నగర్ వంతెన మరమ్మతు పనులను ఆర్ అండ్‌బీ అధికారులు గురువారం ప్రారంభించారు. ఇటీవల భారీ వర్షాలతో వచ్చిన వరదతో వంతెనపై కొన్ని చోట్ల శ్లాబ్ పక్కకు జరిగింది. దీంతో రాకపోకలు నిలిపేసిన అధికారులు శ్లాబ్‌ను యథాస్థానంలోకి చేర్చేందుకు విశాఖపట్నంకు చెందిన నిపుణుల సూచనలతో మరమ్మతులు చేపట్టారు. ఇందుకోసం సుమారు రూ.1.40 కోట్లు కేటాయించినట్లు ఆర్అండ్‌బీ అధికారి ఒకరు తెలిపారు. వరద ప్రభావం తగ్గిన కొద్ది పనుల్లో వేగం పెంచుతామని వెల్లడించారు. మున్నేరుపై కేబుల్ వంతెన నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారానే ఈ పనులు చేపడుతున్నట్లు తెలిసింది.

వాయిదా వేయండి.. సీనియారిటీ పెంచండి

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల బదిలీలపై ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు గురువారం వరంగల్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డిని కలిశారు. వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కార్మికుల బదిలీలపై కసరత్తు జరుగుతున్న నేపథ్యాన 327, 1104, టీఆర్‌వీకేఎస్, సీఐటీయూ తదితర యూనియన్ల ప్రతినిధులు సీఎండీతో చర్చించారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉన్నందున పిల్లల చదువుల దృష్ట్యా ప్రస్తుతం బదిలీలు వాయిదా వేయడమే కాక రెండేళ్ల స్టేషన్ సీనియారిటీని మూడేళ్లకు పెంచాలని కోరారు. అయితే, రాష్ట్ర స్థాయి నిర్ణయం మేరకు బదిలీల ప్రక్రియ ఉంటుందని సీఎండీ వివరించినట్లు సమాచారం. అయితే, కొన్నాళ్ల క్రితం బదిలీల కంటే ముందు పదోన్నతులు కల్పించాలని కోరడంతో ఇటీవల ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఈ ప్రక్రియ పూర్తవడంతో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలను రూపొందించినట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో విధివిధానాలు విడుదల చేసి అక్టోబర్ మొదటి వారంలోగా ప్రక్రియ పూర్తి చేసే అవకాశముందని తెలిసింది.

81.60 కోట్లు కట్టాల్సిందే..


మిల్లులో వివరాలు ఆరా తీస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లు యాజమాన్యానికి నోటీసులు

- కొణిజర్లలోని ఎస్ఏఆర్ రైస్ మిల్లులో ముగిసిన తనిఖీలు
- అధికారుల పాత్రపై సివిల్ సప్లయీస్ ఉన్నతాధికారుల సీరియస్
- కొందరిపై త్వరలోనే శాఖాపరమైన చర్యలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)గా ఇవ్వాల్సిన ధాన్యాన్ని స్వాహా చేసిన ఎస్ఏఆర్ రైస్ మిల్లుపై పౌర సరఫరాల సంస్థ కొరడా ఝుళిపించింది. పక్కదారి పట్టించిన ధాన్యం విలువ, వడ్డీ, జరిమానా కలిపి రూ.81.60 కోట్ల మేర చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. అంతేకాక మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు కోసం కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక ఈ కుంభకోణంలో సంస్థ అధికారుల పాత్ర ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీల్లో తేలినట్లు తెలిసింది. తనిఖీలు చేయకుండా ధాన్యం, బియ్యం పక్కదారి పట్టించేలా మిల్లు యాజమాన్యానికి సహకరించిన కొందరు అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

రెండు రోజులు తనిఖీ చేసి..

కొణిజర్ల మండలం లాలాపురంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో హైదరాబాద్‌కు చెందిన పౌరసరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ బృందం మంగళ, బుధవారాల్లో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ధాన్యం నిల్వల్లో భారీగా వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. జిల్లాలోని ఈ మిల్లులో భారీగా సీఎంఆర్ స్వాహా చేశారన్న ఫిర్యాదులతో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపట్టి ధాన్యం నిల్వలను పరిశీలించగా అక్రమాలు బయటపడ్డాయి. అయితే, సీఎంఆర్ మాయమైనా జిల్లా అధికారులు ఇప్పటి వరకు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అసలు, వడ్డీతో పాటు జరిమానా

పౌర సరఫరాల సంస్థ ఎస్ఏఆర్ రైస్ మిల్లుకు 2022–23 రబీ, 2023–24 ఖరీఫ్ సీజన్లలో కలిపి ఎస్ఏఆర్ రైస్ మిల్లుకు సుమారు 35,622 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. అయితే, ఈ ధాన్యాన్ని మర ఆడించి 17,023.226 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో కొంత మేర సీఎంఆర్‌గా ఇచ్చినా మిగతా బియ్యం ఇవ్వకపోవడంతో తనిఖీలు చేయగా 25,149.997 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. ఈమేరకు బియ్యం అసలు ధరతో పాటు జరిమానా, వడ్డీ లెక్కలు వేశారు. అలాగే మిల్లు అప్పగించాల్సిన ఫోర్టిఫైడ్ రైస్ విలువను కూడా లెక్కించారు. మిల్లు ఇవ్వాల్సిన బియ్యం ధర రూ.62,61,04,529 ఉండగా, 25 శాతం జరిమానా రూ.15,65,26,133 కలిపి రూ.78,26,30,662 అయింది. ఇక 2022–23 రబీ పంటకు సంబంధించి ఈ ఏడాది మే 16 నుంచి మూడున్నర నెలలకు 12 శాతం వడ్డీ రూ.1,88,05,514 వేశారు. ఇక 64.200 మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ విలువను కలిపి మొత్తంగా రూ.81,60,90,635 చెల్లించాలని ఎస్ఏఆర్ మిల్లు యాజమాన్యానికి టాస్క్‌ఫోర్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

పరస్పర అవగాహనతోనే..

సీఎంఆర్ చెల్లించాల్సిన గడువు చివరకు చేరినా ఎస్ఏఆర్ మిల్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడానికి జిల్లా అధికారులతో ఉన్న అవగాహనే కారణమని తెలుస్తోంది. దాదాపు 17,023.226 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వకపోగా.. టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీ సమయాన ధాన్యం లెక్కలు కూడా చూపించలేదు. దీంతో ధాన్యాన్ని మర ఆడించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. వచ్చే ఏడాది జనవరి నుంచి రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయాలన్న ప్రభుత్వం సీఎంఆర్ ఇవ్వని మిల్లుల్లో తనిఖీలకు ఆదేశించడంతో ఎస్ఏఆర్ మిల్లు వ్యవహారంపై ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వ సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో అక్రమాలు నిజమేనని బయటపడింది.

వేటు ఖాయమేనా?

ఎస్ఏఆర్ మిల్లులో ధాన్యంలో వ్యత్యాసాన్ని గుర్తించిన టాస్క్‌ఫోర్స్ అధికారులు రికవరీ చేయాల్సిన సొమ్మును తేల్చగా.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. జిల్లాలోని పలు మిల్లుల యాజమాన్యాలు సీఎంఆర్ ఇవ్వకపోయినా పట్టించుకోని అధికారులపై కఠిన చర్యలకు సిఫారసు చేసే అవకాశముంది. ప్రధానంగా ఎస్ఏఆర్ మిల్లు నుంచి అధికారులకు భారీ స్థాయిలో నగదు ముట్టిందనే ఆరోపణలపై విచారణ చేయిస్తారా.. కేసులు పెడతారా అన్నది తేలాల్సి ఉంది.

మిల్లు యజమానిపై చీటింగ్ కేసు

కొణిజర్ల: సీఎంఆర్ సరఫరా చేయకుండా, ధాన్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వాన్ని మోసగించినందుకు గాను కొణిజర్ల మండలం లాలాపురం సమీపంలోని ఎస్ఏఆర్ రైస్ మిల్లు యాజమాన్యంపై పౌరసరఫరాల అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 35,622 మెట్రిక్ టన్నుల ధాన్యంలో 25,149 మెట్రిక్ టన్నుల మేర పక్కదారి పట్టించినట్లు తేలడంతో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గంటా శ్రీలత ఫిర్యాదు చేశారు. దీంతో మిల్లు యజమాని మేడంపూడి రమాజ్యోతిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సూరజ్ తెలిపారు.

అవకతవకలు జరిగాయి..



సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ నుంచి ఎస్ఏఆర్ రైస్ మిల్లుకు సీఎంఆర్ కోసం ధాన్యాన్ని కేటాయించాం. అయితే, యాజమాన్యం ధాన్యాన్ని సొంత అవసరాలకు వాడుకున్నట్లు మా తనిఖీల్లో తేలింది. దీంతో మిల్లు యజమాని ఎం.రమాజ్యోతిపై కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాక సంజాయిషీ నోటీసులు జారీ చేశాం. సీఎంఆర్ ధరతోపాటు వడ్డీ, జరిమానా చెల్లించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శ్రీలత, మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

కొత్త కోర్సులు.. సత్వర ఉపాధి


బోధన కోసం సిద్ధం చేసిన కంప్యూటర్లు


ఎలక్ట్రిక్ వెహికల్ ట్రేడ్‌లో శిక్షణకు తెప్పించిన ఆటో

ఏటీసీగా ఖమ్మం ఐటీఐ అప్‌గ్రేడ్

- రాష్ట్రంలో మూడింట మనకూ అవకాశం
- ఆరు కొత్త కోర్సుల్లో ప్రవేశానికి రేపటి వరకు గడువు
- పూర్తిచేసే విద్యార్థులకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు

ఖమ్మం సహకారనగర్: ఐటీఐల్లో సంప్రదాయ కోర్సులు కొనసాగుతుండగా, వీటిని పూర్తిచేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కరువవుతున్నాయి. దీంతో ఐటీఐల్లో ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా కోర్సుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగానే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని 65ప్రభుత్వ ఐటీఐల్లో తొలుత మూడింటికి అవకాశం కల్పించారు. హైదరాబాద్ మల్లేపల్లిలోని ఐటీఐ, నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐతో పాటు ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐకి అవకాశం దక్కింది. ఇందులో ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులకు సత్వర ఉపాధి లభించనుంది.

నాలుగు ఫేజ్‌లు పూర్తి

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రస్తుతం ఏడు కోర్సులు ఉన్నాయి. వీటిలో ప్రవేశాలకు నాలుగు దశల్లో కౌన్సెలింగ్ పూర్తయింది. దీంతో ఖమ్మం ఐటీఐలో 192సీట్లకు గాను 143మంది విద్యార్థులు చేరారు. ఖాళీగా ఉన్న 49సీట్ల భర్తీ కోసం ఐదో విడతగా ఈనెల 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇంతలోనే కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంతో డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే పాత కోర్సుల్లో చేరిన వారు కళాశాలల్లో సంప్రదించి మార్చుకునే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు.

అనుకోకుండా ప్రారంభం

ఈ ఏడాది ఖమ్మం ఐటీఐని ఏటీసీగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ కొత్త కోర్సులు ఈ ఏడాది నుంచి ప్రారంభమవుతాయని అంతా భావించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎంపిక చేయగా, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ భవన నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయి. రూ.4.77 కోట్లతో తరగతి గదులు, ల్యాబ్ నిర్మించాలని నిర్ణయించారు. ఇంతలోనే అవసరమైన పరికరాలు, ఫర్నీచర్‌తో పాటు అధ్యాపక బృందాన్ని టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ కేటాయించింది. వీరిలో ఇద్దరు అధ్యాపకులు చేరారు. జూన్‌లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైనా నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో కోర్సులు వచ్చే ఏడాదే ప్రారంభమతాయని అనుకున్నారు. కానీ నాలుగు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఐదో దశకు వచ్చే సరికి కొత్త కోర్సుల్లోనూ ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రకటించడం విశేషం. కాగా, ఒక్కో కోర్సులో 20మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశముంటుంది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో బోధన

ఏటీసీకి కావాల్సిన భవన నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో ప్రస్తుతం ఉన్న గదుల్లోనే కొత్త కోర్సుల బోధనకు నిర్ణయించారు. ఇందుకోసం ఆయా కోర్సులకు సంబంధించిన సామగ్రి, ఫర్నీచర్‌ను సిద్ధం చేశారు. ఐదో విడతలో ప్రవేశాలు పొందే వారితో పాటు గత నాలుగు విడతల్లో చేరిన వారికి అక్టోబర్ 1నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

కొత్త కోర్సులతో సత్వర ఉపాధి



రాష్ట్ర ప్రభుత్వం కొత్త కోర్సులను ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభిస్తోంది. ఆరు కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తాం. ఆయా కోర్సుల బోధనకు అవసరమైన పరికరాలు, ఫర్నీచర్ సిద్ధంగా ఉండగా, అధ్యాపకులు సైతం చేరుతున్నారు. ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టిన ఈ కోర్సుల ద్వారా సత్వర ఉపాధి లభించే అవకాశముంది.

– ఏ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఖమ్మం

కొత్త కోర్సులు ఇవే...

కోర్సు	కాలపరిమితి
మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్	ఏడాది
ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మానుఫ్యాక్చరింగ్	ఏడాది
ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది
బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్)	రెండేళ్లు
అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ మిషనింగ్ టెక్నీషియన్	రెండేళ్లు
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్	రెండేళ్లు


పరికరాలను పరిశీలిస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పర్యాటక గుమ్మంగా 'ఖమ్మం'

- ఖిల్లాపై రోప్‌వే నిర్మాణం.. పాలేరు, వైరాలో బోటింగ్
- పర్యాటక అభివృద్ధిపై సమీక్షలో మంత్రి తుమ్మల


చైర్మన్, ఎండీతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్ది, ఖమ్మం ఖిల్లాకు పూర్వవైభవం తీసుకొచ్చేలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం ఆయన ఖిల్లాపై రోప్‌వే ఏర్పాటు తదితర పనులపై టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎండీ ప్రకాష్‌రెడ్డితో సమీక్షించారు. ఖమ్మం ఖిల్లాపై రోప్‌వే పనులను శరవేగంగా పూర్తిచేయాలని, నిధులు సమకూర్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. లోయర్ పాయింట్ నిర్మాణానికి లకారం చెరువు పరిసర ప్రాంతం అనువుగా ఉంటుందని తెలిపారు. రోప్‌వే నిర్మాణం పూర్తయ్యాక పార్క్‌లు, హోటళ్లు, హాళ్ల నిర్మాణం రెండో దశలో చేపట్టాలన్నారు. ఇక దక్షిణ అయోధ్యగా పిలిచే భద్రాద్రిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కిన్నెరసాని ప్రాజెక్టు అభివృద్ధి, వసతుల కల్పనకు కృషిచేస్తామన్నారు. అంతేకాక నేలకొండపల్లి బౌద్ధస్తూపం, భక్త రామదాసు ధ్యాన మందిరం, కూసుమంచి శివాలయం అభివృద్ధి, పాలేరు, వైరా రిజర్వాయర్లలో బోటింగ్ ఏర్పాటుకు సిద్ధం కావాలని మంత్రి సూచించారు. ఈమేరకు టూరిజం శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ రోప్‌వే పనులకు సంబంధించి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేయగా, నిర్మాణ సంస్థలను సంప్రదిస్తున్నట్లు తెలిపారు.

విద్యతో సమాజంలో సమానత్వం

- చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం
- జయంతి వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యతో మాత్రమే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆమె విగ్రహానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మార్పు, నవ సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తుల్లో చాకలి ఐలమ్మ ఒకరని, ఆమె పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చెప్పారు. పాఠశాలల సందర్శనలో బాలికలు అధికంగా ఉండడం సంతోషం కలిగిస్తోందని తెలిపారు. బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, వివిధ సంఘాల నాయకులు కె.శ్రీలక్ష్మి, దుంపటి నగేష్, మేకల సుగుణారావు, గాలి అంజయ్య, పిండిప్రోలు రామ్మూర్తి, ముదిగొండ వెంకటప్పయ్య, ప్రొఫెసర్ డాక్టర్ బీ.వీ.రాఘవులు, జక్కుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

■ ఖమ్మం సహకారనగర్: వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆమె చిత్రపటానికి అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో రాజేశ్వరి, సీపీఓ ఎ. శ్రీనివాస్, డీఐఈఓ రవిబాబు, ఏఓ అరుణ, కె.శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

కూసుమంచి: సాగర్ ఆయకట్టు పరిధిలో చివరి ఎకరా వరకు సాగునీరు అందిస్తామని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మండలంలోని పాలేరు ఎడమ కాల్వకు ఇటీవల గండి పడగా పూడ్చిన ప్రాంతం వద్ద నీటి సరఫరాను గురువారం ఆయన పరిశీలించారు. హట్యా తండా వద్ద గండి పూడ్చివేత సమయాన లీకేజీ నియంత్రణ కోసం యూటీ తొలగింపు, ఎదురవుతున్న అవాంతరాలపై ఆరా తీశారు. యూటీని పూర్తిగా తొలగించడంతో ఆ మార్గంలో వెళ్లే వరద నిలిచిపోగా భారీ మోటార్ల ద్వారా ఎత్తిపోస్తుండగా పరిశీలించి కట్ట పటిష్టతపై సూచనలు చేశారు. అనంతరం పాలేరులోని మినీ హైడల్ ప్రాజెక్టు వద్ద గండి పడగా పూడ్చిన ప్రాంతాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఇరిగేషన్ డీఈఈ అనన్య, తహసీల్దార్ సురేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రేపు జీపీ ఓటర్ల తుది జాబితా

- 922 అభ్యంతరాలను పరిష్కరించిన అధికారులు
- అత్యధికంగా తిరుమలాయపాలెంలో 271 క్లెయిమ్‌లు



ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం జీపీలు, వార్డుల వారీగా అధికారులు ఇటీవల ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ జాబితాలను అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించగా, జిల్లాలో పురుష ఓటర్లు 4,12,398 మంది, 4,39,120 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తేలింది. ఈ ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించగా 922 క్లెయిమ్‌లు నమోదయ్యాయి. వీటన్నింటినీ పరిష్కరించిన అధికారులు శనివారం ఓటర్ల తుది జాబితా ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.

చింతకాని, రూరల్‌లో తొమ్మిదే..

జిల్లాలో 586 గ్రామపంచాయతీలకు గాను 5,398 వార్డులు ఉన్నాయి. ఆయా జీపీల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయగా, గడువు ముగిసే నాటికి 922 అభ్యంతరాలు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా తిరుమలాయపాలెం మండలం నుండి 271 అభ్యంతరాలు రాగా, చింతకాని, ఖమ్మం రూరల్ మండలాల తొమ్మిది అభ్యంతరాలు వచ్చాయి. వీటన్నింటినీ పరిష్కరించినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఓటర్ల తుదిజాబితా విడుదల చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. అయితే, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల తేదీని ప్రకటించాక జాబితాలో మార్పులకు, చేర్పులకు అవకాశం ఉంటుందని డీపీఓ తెలిపారు.

త్వరలోనే 100 పడకల ఆస్పత్రి ప్రారంభం


వైద్యులతో సమీక్షిస్తున్న డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి: సత్తుపల్లిలో వంద పడకల ఆస్పత్రి భవనం తుదిదశకు చేరినందున త్వరలోనే ప్రారంభించనున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిని గురువారం తనిఖీ చేసిన ఆయన క్యాజువాలిటీ, డయాలసిస్ కేంద్రం, ఆరోగ్యశ్రీ విభాగాల్లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్యసేవలు, భోజనం నాణ్యతపై తెలుసుకున్నారు. వైద్యులు సురేష్ నారాయణ్, జయలక్ష్మి, నారాయణమ్మ, సాత్విక్, రాజేష్, ప్రణయ్, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే, పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిని సైతం తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ మరో ల్యాబ్ టెక్నీషియన్‌ను కేటాయించడంతో పాటు ప్లేట్‌లేట్ కౌంటింగ్ మిషన్ ఏర్పాటుకు కలెక్టర్ అనుమతి కోరినట్లు తెలిపారు. అలాగే 108, 104 వాహనాలు కేటాయిస్తామని చెప్పారు. కాగా, నెల వ్యవధిలో నాలుగో సారి డీసీహెచ్‌ఎస్ పెనుబల్లి ఆస్పత్రిని తనిఖీ చేయడంతో వైద్యసేవలు కొంత మేర మెరుగుపడ్డాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఔట్ సోర్సింగ్ వాచ్‌మెన్లకు వేతనాలు పెంచి నెలనెలా చెల్లించాలని పౌరహక్కుల సంఘం నాయకుడు కాటినేని శ్రీనివాసరావు కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్, వైద్యులు రంజిత్‌కుమార్, వరుణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

వరద బాధితులకు రూ.లక్ష విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్‌: మున్నేటి వరద బాధితులను ఆదుకోవడం కోసం 'నా ఖమ్మం కోసం నేను' పేరిట కలెక్టర్‌ ఇచ్చిన పిలుపుతో పలువురు ముందుకొస్తున్నారు. ఇందులో భాగంగానే ఖమ్మం 3వ డివిజన్‌ వాసులు కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌కు గురువారం రూ.లక్ష చెక్‌ అందజేశారు. డివిజన్‌లోని జయనగర్‌ కాలనీ 23వ లైన్‌కు చెందిన మనస్విని హిల్స్‌ వాసులు కార్పొరేటర్‌ మల్లీదు జగన్‌తో కలిసి చెక్కు అందజేయగా కలెక్టర్‌ అభినందించారు.

కౌన్సిలర్‌ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలోని డీఎస్‌ఆర్‌సీ సెంటర్‌లో కౌన్సిలర్‌ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్‌ సూపరింటెండెంట్‌ ఎల్‌.కిరణ్‌కుమార్‌ తెలిపారు. పీజీ, డిప్లొమా ఇన్‌ సైకాలజీ, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, హ్యూమన్‌ డెవలప్‌మెంట్‌ తదితర విద్యార్హతలు కలిగిన వారు వచ్చేనెల 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జనరల్‌ అభ్యర్థులైతే రూ.500, ఎస్సీ, ఎస్టీలైతే రూ.300 డీడీని 'మెడికల్‌ సూపరింటెండెంట్‌, ప్రభుత్వ జనరల్‌ హస్పిటల్‌, ఖమ్మం' పేరిట తీయాలని తెలిపారు. ఒకటే పోస్టు ఉండగా, స్త్రీ, పురుషుల్లో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

జిల్లా ఆస్పత్రిలో 'సేవా సే సీఖెన్‌'



ఎంపికైన అభ్యర్థులతో ఆస్పత్రి అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రధాన ఆస్పత్రిలో 'సేవా సే సీఖెన్‌ - 2024' కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈమేరకు మై భారత్‌ వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేసుకున్న ఎనిమిది మంది అభ్యర్థుల్లో బ్రౌన్స్‌ కాలేజ్‌ అఫ్‌ ఫార్మసీ కాలేజీ విద్యార్థులు ఐదుగురిని ఎంపిక చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్‌ కిరణ్‌కుమార్‌, ఆర్‌ఎంఓ కళావతిబాయి తెలిపారు. అనుభవాత్మక అభ్యాసన ద్వారా యువతకు ఆస్పత్రి సేవలపై అవగాహన కల్పించి సేవా స్ఫూర్తిని నింపడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. తద్వారా విద్యార్థులు వైద్యరంగంలో అనుభవం పొందడంతో సమాజ సేవ చేసే అవకాశం లభిస్తుందని వెల్లడించారు.

ఖో-ఖో సబ్‌ జూనియర్‌ రాష్ట్ర జట్టు కోచ్‌గా శ్రీదేవి



క్రీడాకారులతో కోచ్‌ శ్రీదేవి

సత్తుపల్లి: రాష్ట్ర స్థాయి సబ్‌ జూనియర్‌ ఖో-ఖో జట్టు కోచ్‌గా సత్తుపల్లి ప్రభుత్వ బాలికల పాఠశాల పీఈటీ చీకటి శ్రీదేవి ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టుకు 18 మంది బాలురు, బాలికలు ఎంపిక కాగా ఈనెల 28 నుంచి జార్ఖండ్‌లో జరిగే 34వ జాతీయ సబ్‌ జూనియర్‌ ఖో-ఖో టోర్నీలో పాల్గొనేందుకు బయలుదేరారు. ఈ జట్టుకు శ్రీదేవి కోచ్‌గా ఎంపిక కావడంపై ఎమ్మెల్యే డాక్టర్‌ రాగమయి తదితరులు అభినందించారు.

విద్యుత్‌ పనుల్లో క్లాస్‌-2, 3 కాంట్రాక్టర్లకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్‌ పరిధిలో పనుల నిర్వహణకు క్లాస్‌-1తో పాటు క్లాస్‌-2, 3 కాంట్రాక్టర్లకు కూడా అవకాశం కల్పిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. గతంలో క్లాస్‌-1 కాంట్రాక్టర్లకు మాత్రమే విద్యుత్‌ సంబంధిత పనులు అప్పగించాలని నిర్ణయించారు. ఫలితంగా తాము ఉపాధి కోల్పోతామని క్లాస్‌-2, 3 కాంట్రాక్టర్లు విన్నవించడంతో వారికి అవకాశం కల్పించారు. ఈమేరకు వివిధ సెక్షన్లలో పనులు నిర్వహించేందుకు టెండర్లు దాఖలు చేయగా, గురువారం ఖమ్మం సర్కిల్‌ కార్యాలయంలో పరిశీలించారు. అర్హతల ఆధారంగా కాంట్రాక్టర్లకు పనులను అప్పగించనున్నారు. ఇప్పటి వరకు క్లాస్‌-1 కాంట్రాక్టర్లు 36 మందికి అవకాశం దక్కగా, క్లాస్‌-2, 3 కాంట్రాక్టర్లు మరో 23 మందికి ఇకపై పనులు దక్కే అవకాశముంది.

పాలేరు చేరిన సాగర్‌ జలాలు

కూసుమంచి: సాగర్‌ నుంచి విడుదల చేసిన నీరు మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు గురువారం సాయంత్రం నుంచి చేరుతోంది. ఇటీవల భారీ వరదలతో సాగర్‌ ఇన్‌ఫ్లో కాలువకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలో రంగుల బ్రిడ్జి వద్ద భారీ గండి పడింది. అక్కడ గండి పూడ్చివేత పనులు పూర్తికావడంతో అధికారులు పాలేరుకు 740 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేశారు. దీనికి తోడు ఎగువన కురుస్తున్న వర్షాలతో మరో 2,500 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో 23 అడుగుల సామర్థ్యం కలిగిన పాలేరు రిజర్వాయర్‌ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 18.01 అడుగులుగా నమోదైంది.

ఖరారు, వసూళ్ల బాధ్యత ప్రైవేట్‌కు!?

- కేఎంసీలో ఆస్తి పన్ను మదింపునకు ప్రత్యేక ప్రణాళిక
- అక్రమాలను అరికట్టి ఆదాయం పెంచుకోవడంపై దృష్టి
- మేయర్‌, కమిషనర్‌ భేటీలో పలు అంశాలపై చర్చ



ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌

ఖమ్మంమయూరిసెంటర్‌: పదేళ్ల కాలంలో ఖమ్మం నగరం ఊహించని రీతిలో విస్తరించింది. వ్యాపార, వాణిజ్య సముదాయాలు పెరగడం, ఇక్కడ నివసించే కుటుంబాల సంఖ్య భారీగా పెరిగింది. అయినా ఖమ్మం మున్సిపల్‌ కార్పొరేషన్‌కు ఆదాయం మాత్రం నామమాత్రంగానే పెరుగుతోంది. గత ఐదేళ్ల కాలంలో కేఎంసీకి రూ.25 కోట్ల నుండి రూ.30 కోట్ల వరకు మాత్రమే ఆదాయం సమకూరుతోంది. ఎటు చూసినా వాణిజ్య, నివాస కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలు ఉన్నా పన్నులు తక్కువగా వసూలవుతుండడంతో కేఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ నేపథ్యాన అక్రమాలను అరికట్టి, పూర్తిస్థాయిలో పన్నులు చేయడం ద్వారా రాబడి గణనీయంగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం పన్నుల మదింపు, వసూళ్ల బాధ్యతలను ప్రైవేట్‌ ఏజెన్సీలకు అప్పగించాలనే యోచనకు వచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై మేయర్‌ పునుకొల్లు నీరజ, కమిషనర్‌ అభిషేక్‌ అగస్త్య ప్రాథమికంగా ఓ నిర్ణయానికి సమాచారం.

పన్ను మదింపులో తేడాలు?

ఖమ్మంలోని గృహ, వాణిజ్య భవనాల నిర్మాణం పూర్తయ్యాక వాటి అనుమతులను పరిశీలించడమే కాక కొలతలు వేసి పన్ను విధించాల్సి ఉంది. ఈ పనంతా కేఎంసీలోని రెవెన్యూ విభాగం సిబ్బంది చేయాలి. కానీ యాజమానులతో కుమ్మక్కవుతున్న కొందరు సిబ్బంది కొందరు కొలతలను తక్కువగా నమోదు చేయడం, ఆపై అనుమతులు లేకున్నా జరిమానా విధించకుండా తక్కువ పన్నులు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఫలితంగా కేఎంసీ ఆదాయానికి గండి పడుతోంది. అంతేకాక వాణిజ్య భవనాలను నివాస భవనాలను నమోదు చేస్తుండడంతో పన్నులు తక్కువగా వసూలవుతున్నాయి.

ప్రత్యేక ప్రణాళిక

నగరంలో ఏ అభివృద్ధి పని చేయాలన్నా పన్నుల రూపంలో వచ్చే ఆదాయమే కీలకం. ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు, పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల డీజిల్‌, విద్యుత్‌ బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలకు ఇందులో నుంచే కేటాయించాలి. అయితే నగరం విస్తరించి ఖర్చులు పెరుగుతున్నా ఆదాయం ఆ స్థాయిలో పెరగడం లేదని పాలకవర్గం, అధికారులు భావిస్తున్నారు. దీంతో కమర్షియల్‌, రెసిడెన్షియల్‌, కమర్షియల్‌ కం రెసిడెన్షియల్‌ భవనాల లెక్కలను పక్కాగా తేల్చాలని నిర్ణయించినట్లు తెలిసింది. రెవెన్యూ, టౌన్‌ ప్లానింగ్‌ విభాగాల సిబ్బందితో సర్వే చేయించి, అసెస్‌మెంట్ల వారీగా పన్ను పక్కాగా విధించేలా ఆదేశాలు ఇవ్వనున్నారు. ఇదికాక ఆస్తిపన్నుల మదింపునకు, వసూళ్లకు మరో ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియను ప్రైవేట్‌ ఏజెన్సీకి అప్పగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై చర్చించినట్లు సమాచారం. కొత్తగా నిర్మించే భవనాల పన్ను మదింపు ఏజెన్సీ ద్వారా చేయిస్తే పారదర్శకంగా ఉంటుందనే భావనకు వచ్చినట్లు తెలిసింది. ఇదే అంశంపై గురువారం పునుకొల్లు నీరజ, కమిషనర్‌ అభిషేక్‌ అగస్త్య సమావేశమైనట్లు సమాచారం. ఆదాయం పెరగకపోవడానికి ఇంటి పన్ను వసూళ్లలో లోపాలే కారణమని భావనకు వచ్చినట్లు తెలిసింది. దీంతో ప్రతీ భవనం నుండి కొలతల ప్రకారం పన్ను రాబట్టేందుకు సర్వే చేయించాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఆదాయం పెంచడమే లక్ష్యం..

నగర పాలక సంస్థకు ఆదాయం పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆస్తి పన్నుల మదింపు, వసూళ్లపై దృష్టి సారిస్తున్నాం. పన్నుల వసూళ్లలో పారదర్శకత పాటిస్తూ, ప్రతీ రూపాయి కేఎంసీకి చేరేలా చర్యలు తీసుకుంటాం. కొలతల ఆధారంగానే పన్నులు విధించేలా ఉద్యోగులకు ఆదేశాలు ఇస్తున్నాం. పన్నుల మదింపు ప్రక్రియ ప్రైవేట్‌ ఏజెన్సీలకు ఇస్తే ఎలా ఉంటుందనే అంశంపై ఆలోచన చేస్తున్నాం.

– పునుకొల్లు నీరజ, మేయర్‌, కేఎంసీ

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ శ్రీజ

ఖమ్మం సహకారనగర్‌: తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాటుచేయాలని చేయాలని అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమావేశమైన ఆమె వచ్చేనెల 3నుంచి 9వ తేదీ వరకు పదో తరగతి, ఇంటర్‌ పరీక్షలు మొదలవుతాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 340 మంది, ఇంటర్‌ పరీక్షలకు 373 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, ఎలాంటి అవకతవకలు జరగకుండా ఏర్పాట్లుచేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద సిట్టింగ్‌ స్క్వాడ్ను నియమించడంతో పాటు కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్‌ అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్‌ విద్యాధికారి కె.రవిబాబు, ఓపెన్‌ స్కూల్‌ కోఆర్డినేటర్‌ మద్దినేని పాపారావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్‌ బి.సైదులు, ఏ.సంపత్‌ కుమార్‌, కె.సతీశ్‌, ధన తదితరులు పాల్గొన్నారు.



పెద్దాస్పత్రిలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ శ్రీజ

పెద్దాస్పత్రిలో తనిఖీ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాజనరల్‌ ఆస్పత్రిని అదనపు కలెక్టర్‌ శ్రీజ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా డ్రగ్‌ స్టోర్‌లో పరిశీలించి మందులు లేకపోతే ఇండెంట్‌ పెట్టాలని సూచించారు. ఆతర్వాత సదరమ్‌ గదికి వెళ్లిన ఆమె సమయానికి సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంపై సిబ్బంది మందలించారు. స్టాంపుల సమస్య ఉందని చెప్పడంతో వెంటనే తెప్పించాలని తెలిపారు. ఆతర్వాత వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడిన ఆమె పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్‌, తాగునీటి సరఫరాపై సూచనలు చేశారు. ఆస్పతి సూపరింటెండెంట్‌ ఎల్‌.కిరణ్‌కుమార్‌, ఆర్‌ఎంఓ రాంబాబు, డాక్టర్‌ రాంప్రసాద్‌ పాల్గొన్నారు.

హోరాహోరీగా లారీ యూనియన్‌ ఎన్నికలు

- 33 ఏళ్ల తర్వాత తొలిసారి బ్యాలెట్‌ పోరు
- ఈనెల 29న పోలింగ్‌, అదేరోజు ఫలితం



ప్రచారం చేస్తున్న రెండు ప్యానళ్ల సభ్యులు

సత్తుపల్లి: సత్తుపల్లి లారీ యజమానుల సంఘం ఎన్నికలు హోరాహోరీగా సాగుతున్నాయి. సాధారణ ఎన్నికల తరహాలోనే రెండు ప్యానళ్ల బాధ్యులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. 1991లో సంఘం ఏర్పడగా రెండేళ్లకోసారి నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగానే ఎన్నుకుంటున్నారు. మధ్యలో ఓసారి పోటీ ఏర్పడితే పెద్దల జోక్యంతో రాజీ ఫార్ములా కుదిర్చారు. కానీ ఈసారి రెండు ప్యానళ్లు పోటీకి సిద్ధం కాగా పట్టణ ప్రముఖులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో 33ఏళ్ల తర్వాత ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారడంతో రెండు ప్యానళ్లుగా విడిపోయిన యజమానులు పోటీపోటీగా ప్రచారం చేస్తున్నారు. సంఘంలో 700 లారీలకు చెందిన 450 మంది యజమానులకు ఓటు హక్కు ఉంది. సీ-బుక్‌ ఉన్న వారికే ఓటు హక్కు ఇవ్వడంతో కొందరు మహిళలు కూడా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ నెల 29న ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్‌ నిర్వహించి ఆ వెంటనే ఓట్లు లెక్కించి ఫలితాన్ని వెల్లడిస్తారు. కుర్చీ గుర్తుతో రావి నాగేశ్వరరావు ప్యానల్‌, గోడ గడియారం గుర్తుతో ఎస్‌.కే.దావూద్‌ ప్యానళ్లు తలపడుతున్నాయి.

లారీ లోడింగ్‌లే ప్రధాన సమస్య

ఎన్నికల్లో సింగరేణి బొగ్గు లోడింగ్‌ సమస్య ప్రధాన అంశంగా ప్రచారం జరుగుతోంది. నాలుగు నెలల నుంచి బొగ్గు లోడింగ్‌ లేక లారీల యజమానులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఫైనాన్స్‌ చెల్లించలేక మనస్తాపంతో కుంగిపోయి ఇటీవల ఒకరు ఆత్మహత్య చేసుకునానరు. దీంతో ప్రతిరోజు కనీసం 150 నుంచి 200 లారీలకు బొగ్గు లోడింగ్‌ ఇప్పిస్తామని, ఐదు లారీల సీలింగ్‌ ఏర్పాటు చేసి అందరికీ లోడింగ్‌ ఇచ్చేలా ప్రయత్నిస్తామని ప్రచారంలో చెబుతున్నారు. కాగా, ఈ యూనియన్‌ పరిధిలో ఆరు టైర్ల లారీలు కిన్లే వాటర్‌ ప్లాంట్‌కు, పెద్ద లారీలు సింగరేణి సంస్థ నుంచి జేవీఆర్‌, కిష్టారం ఓసీల నుంచి వెళ్తుంటాయి.

అదుపు తప్పిన టెంపో వాహనం



రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఆగిన టెంపో వాహనం

కొణిజర్ల: రహదారిపై గుంతలను తప్పించే క్రమాన ఓ టెంపో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా పెను ప్రమాదం తప్పింది. వాహనంలోని ప్రయాణికులు తెలిపిన వివరాలు... కరీంనగర్‌కు చెందిన పది మంది ఏపీలోని అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనానికి వెళ్లి గురువారం తిరిగి వస్తుండగా కొణిజర్ల – పల్లిపాడు మధ్య రహదారిపై గుంతలు ఉండడంతో డ్రైవర్‌ తప్పించబోయాడు. ఈక్రమాన వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఆ పక్కనే పెద్ద గొయ్యి ఉండడంతో టెంపో డ్రైవర్‌ అప్రమత్తమై వాహనాన్ని నిలపడంతో ప్రమాదం తప్పినట్లయింది. అనంతరం పల్లిపాడు గ్రామస్తులు ట్రాక్టర్‌ సాయంతో వ్యాన్‌ను బయటకు తీయగా, కరీంనగర్‌ వాసులు ప్రయాణమయ్యారు.

శిక్షణ ఆధారంగా పనితీరు మెరుగుపడాలి

రఘునాథపాలెం: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా, నీరు కలుషితం కాకుండా చేయాల్సిన మరమ్మతులు, పర్యవేక్షణపై మూడు రోజుల పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాల ఆధారంగా పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈ పుష్పలత సూచించారు. రఘునాథపాలెం రైతు వేదికలో పంప్‌ ఆపరేటర్లకు ఇస్తున్న శిక్షణ గురువారం ముగియగా ఆమె మాట్లాడారు. మోటార్ల మరమ్మతులు, ప్యానెల్‌ బోర్డు నిర్వహణ లోపాలను సరిచేయడం, నీటిశుద్ధి, నాణ్యత పర్యవేక్షణపై శిక్షణ విధినిర్వహణలో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జిల్లా ల్యాబ్‌ పర్యవేక్షణ అధికారి వి.రమ మాట్లాడగా డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ ఆశోక్‌, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ డీఈ ఓంప్రకాష్‌, ఏఈ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లు

పోలీసులను ఆశ్రయించిన పలువురు?

ఖమ్మంఅర్బన్‌: ఖమ్మంకు చెందిన కొందరి వద్ద ఉద్యోగాల పేరుతో పలువురు వసూళ్లకు పాల్పడగా చివరకు మోసమని తేలడంతో బాధితులు గురువారం ఖమ్మం అర్బన్‌ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఖమ్మంకు చెందిన ఒక వ్యక్తి, భద్రాచలానికి చెందిన మహిళ కలిసి ఉద్యోగాల పేరుతో వసూలు చేసినట్లు సమాచారం. ఒక్కొక్కరి వద్ద రూ.3లక్షల వరకు వసూలు చేసినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇద్దరు బాధితులను పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. అయితే, బాధితులు పెద్ద సంఖ్యలోనే ఉంటారని ప్రచారం జరుగుతోంది. పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తే ఎందరు బాధితులు ఉన్నారో బయట పడే అవకాశముంది. ఈ విషయమై సీఐ భానుప్రకాష్‌ను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

నేటి నుంచి సిరిపురంలో 'సోలార్‌' సర్వే

ఖమ్మంవ్యవసాయం: ఎన్పీడీసీఎల్‌ ఖమ్మం సర్కిల్‌ పరిధిలోని మధిర మండలం సిరిపురం గ్రామాన్ని సంపూర్ణ సౌర విద్యుత్‌ గ్రామంగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం పైలట్‌ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వస్థలమైన నాగర్‌కర్నూల్‌ జిల్లాలోని కొండారెడ్డిపల్లి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని సిరిపురంతో పాటు మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి మండలం వెలగనూరును సౌర విద్యుత్‌ గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాలకు పూర్తి స్థాయిలో సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఈ క్రమంలోనే గురువారం ఖమ్మం ఎస్‌ఈ ఏ.సురేందర్‌, అధికారులు సిరిపురం గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలో 5,428 జనాభా ఉండగా, 1,007 గృహ సర్వీసులు, 510 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని గుర్తించారు. ఎంపిక చేసిన ఉద్యోగులకు ఇప్పటికే శిక్షణ ఇవ్వగా శుక్రవారం నుంచి సోలార్‌ విద్యుత్‌ ఏర్పాటుపై సర్వే చేపట్టనున్నారు. సర్వేలో గుర్తించే అంశాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేయనుండగా, త్వరలోనే సిరిపురం సోలార్‌ విద్యుత్‌తో విరాజిల్లే అవకాశం ఉంది.

ముగిసిన చెరువుమాధారం వివాదం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో ఇటీవల చెలరేగిన వివాదం తారస్థాయికి చేరగా, ఇరువర్గాలుగా విడిపోయిన స్థానికులు ఎవరికి వారు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈనేపథ్యాన పోలీసులు కౌన్సెలింగ్‌ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. గణేష్‌ ఉత్సవాల సందర్భంగా ఓ యూట్యూబర్‌ గ్రామంలోని ఓ మతానికి చెందిన వారి విషయమై అనుచితంగా మాట్లాడిన వీడియో వైరల్‌ అయింది. దీంతో ఆ మతానికి చెందిన వారు సమావేశమై గ్రామంలో ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో వారిని పనికి పిలవద్దొని మరో వర్గం తీర్మానించింది. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదులు అందడడంతో ఖమ్మం రూరల్‌ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్‌ ఇరువర్గాలతో గురువారం సమావేశమై కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అందరూ సహకరించాలన్న సూచనకు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగినట్లయింది.

బైక్‌ చక్రంలో చీర చిక్కుకుని పల్టీ..

దంపతులకు తీవ్రగాయాలు

కామేపల్లి: బైక్‌ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు వృద్ధులకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తగూడెం పట్టణానికి చెందిన పొన్నం తులసీరామ్‌, ఆయన భార్య కళావతి బైక్‌పై ఖమ్మంలో ఉన్న తమ కుమార్తె వద్దకు గురువారం కామేపల్లి మీదుగా వెళ్తున్నారు. కాగా, తాళ్లగూడెం స్టేజీ సమీపాన కళావతి చీర కొంగు బైక్‌ వెనకాల చక్రంలో పడి చుట్టుకోవడంతో బైక్‌ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కళావతి తలకు తీవ్రగాయం కాగా తులసీరామ్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిని స్థానికులు 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: బైక్‌ అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లడంతో దంపతులకు తీవ్ర గాయాలైన ఘటన ఇది. మండలంలోని మంగాపురం తండాకు చెందిన భూక్యా రాముడు – కమల గురువారం రాత్రి బైక్‌పై నేలకొండపల్లి నుంచి ఇంటికి వస్తున్నారు. నాచేపల్లి శివారులో మూలమలుపు వద్ద బైక్‌ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

తల్లాడ: మండలంలోని నూతనకల్‌కు చెందిన యువతి బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం... ఇంటర్‌ చదువుతున్న గ్రామానికి చెందిన చలమల అనూష(20)కు చిన్నతనం నుంచే ఫిట్స్‌ వస్తున్నాయి. ఈక్రమాన ఆమె తల్లి నాలుగు రోజుల క్రితం చంద్రుగొండ మండలం రావికంపాడులో బంధువుల ఇంటికి వెళ్లింది. ఆపై తండ్రి బయటకు వెళ్లినప్పుడు అనూష ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎక్కడ చికిత్స చేయించుకున్నా ఫిట్స్‌ తగ్గడం లేదనే మనస్తాపంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



షేక్‌ షారూఖ్‌(ఫైల్‌)

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు సమీపాన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పి.వెంకటేష్‌ తెలిపిన వివరాలు... మధిరకు చెందిన షేక్‌ షారూఖ్‌(26) మీనవోలు నుండి మధిరకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన షారూఖ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డిజిటల్‌ ఉపవాసం చేయండి!

- తద్వారా విద్యపై దృష్టి సారించవచ్చు...
- విద్యార్థులకు పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు సూచన



జ్యోతి ప్రజ్వల చేస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్‌ కృష్ణ, పక్కన గరికపాటి, సెక్రటరీ ధాత్రి తదితరులు

ఖమ్మం సహకారనగర్‌: విద్యార్థులు పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి సారించాలంటే వారానికి రెండు రోజులు ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంటూ డిజిటల్‌ ఉపవాసం చేయాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, మహాసహస్ర అవధాని గరికపాటి నరసింహారావు సూచించారు. తద్వారా చదువులో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. ఖమ్మం ఎస్‌బీఐటీలో గురువారం మొదటి సంవత్సర విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఓరియెంటేషన్‌ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అజ్ఞానాన్ని పారద్రోలే ఏకైక ఆయుధం విద్య అని, గురువులు, తల్లిదండ్రులను గౌరవించడం అలవర్చుకోవాలని చెప్పారు. మోయలేని భారంతోనే విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతున్నందున గురువులతో చర్చిస్తే ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా చర్చించిన గరికపాటి వారితో ప్రశ్నోత్తరాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత కళాశాల చైర్మన్‌ గుండాల కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్‌ జి.ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాలలో ఉన్నత ప్రమాణాలు పాటించడం ద్వారా కోర్సు పూర్తిచేసేలా లోగా విద్యార్థులకు మంచి కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోనే తమ కలాశాలలో వంద శాతం సీట్లు భర్తీ కావడం ఆనందంగాఉందని తెలిపారు. అకడమిక్‌ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏ.వీ.వీ.శివప్రసాద్‌, జి.ప్రవీణ్‌కుమార్‌, రవీంద్రబాబు, ఎన్‌.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్‌ రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాయల

ముదిగొండ: విద్యార్థులు చదువుకుంటూ క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం దరి చేరుతుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ముదిగొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం అండర్‌ 14–17 విభాగాల్లో జోనల్‌ స్థాయి(ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం) కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రమశిక్షణతో ముందుకు సాగితే లక్ష్యసాధన సులువవుతుందని చెప్పారు. ఎంఈఓలు డి.రమణయ్య, చలపతిరావు, హెచ్‌ఎంలు కంభంపాటి శాంతి, ఇ.వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు కొమ్మినేని రమేష్‌బాబు, మంకెన దామోదర్‌, ఇలవల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్‌



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్‌: గురుకుల ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో శనివారం హైదరాబాద్‌లో మహాధర్నాను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని టీయూ యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. ఖమ్మంలోని యూటీఎఫ్‌ భవన్‌లో జరిగిన గురుకుల ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల ఉపాధ్యాయులకు 010 హెడ్‌ ద్వారా వేతనాలు చెల్లింపు, విద్యార్థులకు డైట్‌ చార్జీల పెంపు, కేర్‌ టేకర్ల నియామకం తదితర డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గురుకుల ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు శ్యాంకుమార్‌, ఉపేందర్‌, మహేష్‌, దామోదర్‌, శ్రీనివాసరావు, ఎల్లయ్య, కోటేశ్వరరావు, ఉద్దండ్‌ షరీఫ్‌, క్రాంతికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ స్థలంలో ఆక్రమణల తొలగింపు



సిబ్బంది నేలమట్టం చేసిన నిర్మాణం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి 14వ వార్డు శాంతినగర్‌లోని ఎన్నెస్పీ స్థలాల్లో అనుమతి లేకుండా నిర్మించిన ఇళ్లను గురువారం కూల్చివేశారు. మున్సిపల్‌ కమిషనర్‌ చింతల వేణు ఆధ్వర్యాన సిబ్బంది నిర్మాణాన్ని ప్రొక్లెయిన్‌తో నేలమట్టం చేశారు. శాంతినగర్‌ రైతు వేదిక సమీపాన ఎన్నెస్పీ స్థలాలను కొందరు ఆక్రమించగా పలువురు అనుమతి లేకుండానే ఇళ్లు నిర్మించారు. ఈమేరకు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను కూల్చివేశారు. కాగా, ఇక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు పలువురు అధికారుల ఎదుట డిమాండ్‌ చేశారు.

ఇస్రోలో ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- దంపతుల పేరిట ఏపీ నుంచి వచ్చి మధిరలో మకాం, వసూళ్లు
- అదుపులోకి తీసుకున్న భీమడోలు పోలీసులు

మధిర: ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద డబ్బు వసూలు చేసిన వ్యక్తులను ఏపీకి చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరిలోని బంగారుపేటకు చెందిన ఆశం అనిల్‌ బాబు, వైఎస్సార్‌ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్లకు చెందిన శశాంక దంపతుల పేరిట మధిర టీచర్స్‌ కాలనీలోని ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంట్లో అద్దెకు దిగారు. గత ఏప్రిల్‌ 10న అడ్వాన్స్‌ ఇవ్వగా తొలుత 21వ తేదీన శశాంక వచ్చింది. ఆపై 20 రోజుల తర్వాత అనిల్‌బాబు అలియాస్‌ కల్యాణ్‌రెడ్డి కూడా వచ్చాడు. వీరిద్దరికి వివాహం జరగకున్నా, ఇటీవలే వివాహమైందని.. తమ తల్లిదండ్రులు ఇస్రోలో ఉద్యోగం చేస్తారని అనిల్‌బాబు ఇంటి యజమాని కుటుబాన్ని నమ్మించాడు. కాగా, అనిల్‌, శశాంక తిరిగే కార్లపై ఇస్రో, గవర్నమెంట్‌ ఆఫ్‌ ఇండియా, గవర్నమెంట్‌ ఆన్‌ డ్యూటీ అని ఉండేది. హైదరాబాదులో తమకు ఖరీదైన విల్లాలు ఉన్నాయని ఉపాధ్యాయుడి కుటుంబాన్ని తీసుకెళ్లి చూపించారు. ఆపై తమ తల్లిదండ్రుల ద్వారా చెప్పి ఇస్రోలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించడంతో ఉపాధ్యాయుడి కుటుంబం, వారి బంధువులు రూ.10.50 లక్షలు ఇచ్చారు. వీరి వెంట బాపట్లకు చెందిన కారు డ్రైవర్‌ అనుదీప్‌ కూడా ఉండగా, ఏపీలోని పలు చోట్ల ఇలాగే నగదు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఏపీలోని పలు పోలీస్‌ స్టేషన్లలో ఫిర్యాదులు అందగా అనిల్‌బాబు సెల్‌ నంబర్‌ ఆధారంగా బుధవారం రాత్రి ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా భీమడోలు పోలీసులు మధిరకు వచ్చి నకిలీ దంపతులతో పాటు డ్రైవర్‌ను అరెస్టు చేసి తీసుకెళ్లారు. అయితే, ఉపాధ్యాయుడు, ఆయన బంధువులతో పాటు మరికొందరు కూడా వారికి ఉద్యోగాల కోసం డబ్బు చెల్లించినట్లు తెలిసింది. ఆయా బాధితులు శుక్రవారం మధిరలో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ ప్రముఖ కంపెనీలో వర్క్‌ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ, Sal:20k-30k మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయగలరు. వర్క్‌ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [G-9049]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్‌
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)